చివరిరాత్రి

ఊర్వశి

వరదలై పొంగుతూవస్తుంది వాగులోకి కొత్తనీరు; ఇసుకలో నామమాత్రంగాఉండి జీవవాహినై ప్రవహించే పాతనీటిని తనలో కలుపుకోటానికి. అయితే ఉధృతమై వడిగా ప్రవహించే వాగుతోచేరి ప్రవహించలేని, క్రొత్తనీటిఅడుగునపడి ఉక్కిరిబిక్కిరై కొట్టుకునే పాతనీటి గతేమిటి? ఇష్టంలేకపోయినా వాగులో కొట్టుకొనిపోవటమా? లేక ఉధ తంగా ప్రవహించే క్రొత్తనీటికి ఎదురునిలిచి పోరాడటమా? అయితే దాని కది సాధ్యమా?

శాస్త్రి పాతనీరులాటివాడు. పాతనీటిలాంటి శాస్త్రి కది చివరి రాత్రి. చవుకరకం కళ్లలాళ్ళు; అంతే చవుకరకంలో పంచెముకట్టు, విశాలమైన ఫాలభాగంపై ఉదయించే సూర్యుడిలాంటి ఎఱ్ఱనిబొట్టు పెట్టుకుని, ఇరవై సంవత్సరాలు నిండినప్పటికీ, అరవై సంవత్సరాలు నిండినవానివలె, ప్రక్కచూపులు ఎరుగక తన దారిని తానుపోయే శాస్త్రి కది చివరి రాత్రి. అంటే శాస్త్రి జీవితానికి చివరి రాత్రని కాదు. శాస్త్రి ఆ ఊరిలో ఉండటానికి చివరి రాత్రి. ఆ మాటలు ఇంకా వినడానికి చివరిరాత్రి. కరణంగారి ఇంటి అరుగుమీద పాటలు పాడుకోడానికి; తనకై ఆరాటపడే చంద్రిని చూడటానికి, రామమందిరం అరుగుమీద జంతికల భద్రయ్యచేసే తత్వబోధ వినడానికి, హైస్కూలు ఆవరణలోమున్న పొన్నపూలవాసనల నాఘ్రాణించటానికి అది చివరి రాత్రి. శాస్త్రి ఇకముందా ఊరు రాడు. వచ్చే అవసరం లేదతనికి. పది గంటలు గడిచిపోతే ఆ ఊరిలో శాస్త్రి పచ్చిమంచినీళ్లు త్రాగక్కరలేదు. ఆ గాలిని పీల్చనక్కరలేదు. ఆ మాటలు విననక్కరలేదు. అతడు అక్కడ నిలచిన కొద్దికాలం ఒక చరిత్రగా నిలిచిపోతుంది. అయితే అది అతనికి ఇష్టంలేదు. అది అతనికి బాధాకరము. అయినా తప్పదు.

అయితే అసలు కథ ఇదీ:

శాస్త్రిది శ్రీకాకుళంజిల్లాలోని పాలకొండ గ్రామందగ్గరున్న ఒక పల్లెటూరు. అవకాశం ఉన్నంతవరకూ చదువుకొని పొట్టగడుపుకోటానికి తండ్రిలేని శాస్త్రి తల్లిని పోషించి ప్రయోజకుడవటానికి ఎవరో చెపితే 'సిరిరామపురం'లోవున్న వెంకునాయుడిదగ్గర చేరాడు: ఉద్యోగంలేక బాధపడుతున్న శాస్త్రిని ఆదరించి ఎనభైరూపాయలకు తన దగ్గర గుమాస్తాగా వేసికున్నాడు; ఆ ఊరి కల్లా ధనవంతుడైన వెంకునాయుడు. నాయుడిగారి నిమ్మతోటను, అరటితోటను, మామిడితోటను జాగ్రత్తగా అజామాయిషీచేసి ఎగుమతులు సక్రమంగా చేసి, ఒక్కనయాపైసాఅయినా వారా రాకుండాచూచి, డబ్బును యజమానికి వప్పజెప్పే ఉద్యోగందగ్గిరినుండి నౌకర్లుచేసే పనులలాంటివన్నీ ఏవైనా తారసపడిన వన్నీ శాస్త్రివే. ఏపనినైనాసరే భవిష్యత్తుమీది ఆశ కొద్దీ, వెంకునాయుడు తన జీవితానికి సరియైన బాట వేస్తాడనే నమ్మకంకొద్దీ చేస్తూంటాడు శాస్త్రి.

సిరిరామపురం పెద్దఊరేంకాదు. వెయ్యి గడపదాటని, చదరపు ఫర్లాంగు వైశాల్యంగల ఆ ఊరిలో, ఊరికిమధ్యగా రామాలయం, దానికి కొద్ది దూరంలో శివాలయం, ఊరి చివర దుర్గమ్మతల్లి

కోవెల, ఊరికి ఒకమూల ఒక హైస్కూలు, ఊరి చుట్టూ పొలాలు, వెంకునాయుడి తోటలు, చంద్రి నాయుడి చెఱకుతోటలు ఉన్నాయి. నాలుగు కాఫీ దుకాణాలు, ఆరు కిళ్ళీబడ్డీలు ఉన్నాయి ఊళ్ళో. బస్సుపోయే ట్రంకురోడ్డుకి ఆరుమైళ్ళదూరంలో ఉన్న ఆ ఊరికి, సినిమాల నాగరికత వ్యాపించి ఒళ్ళు కనిపించే పెర్లీను, నైలానురూపాలలో, పవుడరు, స్నోల డబ్బాలలో మగపిల్లలు ధరించే బిగుతు దుస్తుల్లో, ఆడపిల్లల కన్నుల కాటుకలలో నిలిచిందంటే శాస్త్రిలాంటి వారికితప్ప మరెవరికీ ఆశ్చర్యం కలుగజేయదు. పల్లెటూరు కావడంచేత శాస్త్రికి ఖర్చు తక్కువే. అందుచేత నలభై రూపాయలు ఖర్చు పెట్టుకుని ఇంటికి మిగతాదిపంపే ఏర్పాటుచేసికున్నాడు శాస్త్రి. బేటా డబ్బులు, పండ్లు దుకాణదారులు యిచ్చే కమీషను కాఫీ ఖర్చుకి, ఇంటద్దెకు సరిపోయేది. అయిదు రూపాయలుమాత్రం పోస్టుమాష్టరు విధిగా ప్రతీనెల కట్టించడంచేత జీతంలో ప్రత్యేకంగా మిగిలేదేదీ ఉండేదికాదు. పూట కూళ్ళమ్మ ఇంట్లో భోజనం, కోమటి సత్తెయ్య అద్దెకిచ్చిన మట్టియింటిలో మకాము. ఉదయం ఎనిమిది గంటలనుండి రాత్రి ఎనిమిది గంటలవరకూ యింటిలో ఉండని శాస్త్రికి ఇంటిని సర్దుకునే సావకాశం ఉండేదికాదు.

మసిబారిన బుడ్డి దీపాన్ని జాగ్రత్తగా తుడిచి, గదికీ వీధికీ కనపడేటట్టు దీపాన్నుంచి భోజనం చేసిన తరువాత కరణంగా రుపయోగించుకోమని యిచ్చిన వాలు కుర్చీలో మేనువాల్చి భవిష్యత్తు గురించి ఆలోచించేవాడు కమాను (కేంపు)లేని రాత్రుళ్ళు. ఏదో దివ్యమైన జీవితం ముందుందనే ఆశతో, మంచిరోజులు రాకపోతాయా అనే ధీమాతో బ్రతికే శాస్త్రిని అన్నివిధాల కలవరపెట్టిన దేవ రంటే చంద్రి. రెండు సంవత్సరాలు జాగ్రత్తగా పనిచేస్తే పట్నంలోవున్న తన బట్టలకొట్టులో నూటఏభై రూపాయలమీద ఉద్యోగాన్నిస్తానని నాయుడిచ్చిన హామీ శాస్త్రిలో, భవిష్యత్తుమీద ఆశ ఏర్పడటానికి అవకాశాన్నిచ్చింది. అయితే అలాంటిశాస్త్రినే కదిలించాలని చూచింది చంద్రి.

ఇంతకీ చంద్రి ఎవరనేగా? ఎ ని శరీర చ్ఛాయతో, తీవైన రూపంతో, ఆకర్షించే కళ్లతో తనపనిలో తానుండాలనికోరే ఇరవై ఏళ్లశాస్త్రిని ఆకర్షించాలని ప్రయత్నించిన స్త్రీయే చంద్రి. పాతికేళ్ల వయసులోఉండే చంద్రికి పదేళ్లప్పుడే పెళ్లయిందట. అయితే భర్తతోమాత్రం ఉండదు చంద్రి. ఆమె భర్త ఆమెను విడిచిపెట్టాడో, చంద్రే అతన్ని విడిచిపెట్టిందో ఎవరికీ తెలియదు. కాని పదిమందిలో తన భర్తను తానే వదలిపెట్టేసిందని గర్వంగా చెప్పుకుంటుంది చంద్రి. కోతల రోజుల్లో, ఉనుపుల రోజుల్లో కూలీకి వెళ్లటం, మామూలు రోజుల్లో ఆ ఊళ్లో ఉన్న ఉద్యోగస్థుల ఇండ్లలో పాచిపనిచేయటం, నీళ్లు మోయటం చంద్రి వ్యాపకాలు.

నిజానికి చంద్రిది అందమైవ, పౌష్టవమైన శరీరం. తెల్లనైన చంద్రి శరీరచ్ఛాయ; శరీరంలోని అందమైన ఒంపులు; కొద్దిగ పైకెత్తిట్టుండే చిన్నముక్కు; క్రింది పెదవి ఎడమ భాగాన్నిఉన్న పచ్చబొట్టు; యిసుక తిన్నెలులాంటి పిరుదులు, వాటినితాకే పొడవై నల్లనైన కృష్ణ వేణమ్మలాంటి జడ; శిల్పి, శిల్పంమీద జాగ్రత్తగా మెరుగుపెట్టిన ట్లనిపించే నున్నగాఉండే ఎత్తయిన వక్షోజాలు; వాటిక్రిందుగా నున్నగా మిలమిల మెరిసే నడుము. సులభంగా ఎట్టిమానవుడినైనా యిట్టే పిచ్చివాడిని చేస్తాయి. అలా పిచ్చివాళ్లయిన వాళ్లు లేకపోలేదు. అంత అందంగా ఉంటే చంద్రిని పొందాలని ఉరకవేసిన సూరినాయుడుకొడుకు సీతాపతి; బలవంతం చేయబోయి మీదికొస్తే సీతాపతి చేతిని కొడవలితో నరికి, యింకా ఏమైనా చేయాలనుకుంటే చంపుతానని బెదరించి ప్రాణరక్షణ చేసుకున్న సాహసవంతురాలు చంద్రి. చంద్రిని సాధించుకోవాలని చూచిన వారందరికీ పరాభవమే అయింది. చంద్రికి ఎవరిపొందూ అక్కరలేదు

చంద్రిని అన్నివిధాలా కనిపెట్టి ఉండేది ఒకడే ఒకడు. అతడే వెంకునాయుడు. అతడు రాజకీయంగా, ఆర్థికంగా బలం కలిగినవాడు కాబట్టి అతన్ని ఆశ్రయించింది చంద్రి. వెంకునాయుడినిసైతం కట్టిపడేసిన రోజులు చంద్రి జీవితంలో లేకపోలేదు. వెంకునాయుడితో చంద్రికి రహస్యంగా సంబంధం ఉందని బహిరంగంగా చెప్పుకోవటం ఒక రహస్యాన్ని విన్నట్టు విన్నాడు శాస్త్రి.

శాస్త్రి యింటికి ఎదురుగా ఉన్న గన్నేరు చెట్టుప్రక్కనే చంద్రి యిల్లు. చంద్రి యింటిని అనుకొని యిరవై గజాలదూరంలో చింతతోపు; ఇంటికొక్రప్రక్క పాడుపడిన పాకలు ఉంటాయి. అందులో చంద్రియింటి వెనుకవున్న జంతికల భద్రయ్యగారి పశువులుంటాయి. చంద్రియింటికి రాజు, రాణీ చంద్రే. ముక్కుతూ మూలుగుతూ ఎప్పుడూ మంచంలో పడుక్కునే తల్లితప్ప వేరే పెద్దదిక్కుగాని, బాధ్యతగాని లేవు చంద్రికి. శాస్త్రి ఎదురింటిలోనే ఉంటుంది కాబట్టి రోజుకు చాలా సార్లు చూస్తుంది చంద్రి శాస్త్రిని. పగటి వేళకన్నా రాత్రిళ్లే చూడగలుగుతుం దాక్షణి. రాత్రి శాస్త్రి భోజనంచేసి వచ్చేంతవరకూ వీధిలో గన్నేరుచెట్టుక్రింద మంచం వాల్చుకుని విశ్రాంతి తీసికున్నమాదిరి మేను వాలుస్తుంది చంద్రి. అతడు రాగానే మంచాన్నెత్తి యింటిలోకి వెళ్లిపోతుంది. వీధిలో శాస్త్రి కుర్చీలో కూర్చునేవేళ సన్నగా కూని రాగాలుతీస్తూ కంచెవతల నిలబడి నీళ్లు పోసి కుంటుంది. శాస్త్రి యింటిదీపపు వెలుగులో కొంత భాగం కంచెఅవతల చంద్రిమీదపడి ప్రతిఫలిస్తుంది. ఆ వెలుగులో కనిపించే చంద్రిని చూడాలని ఏనాడూ అనుకోలేదు శాస్త్రి. అలా శాస్త్రి తాపత్రయ పడకపోయినా అతని కళ్లను చేరే ఆమె విగ్రహం శాస్త్రికి సిగ్గును, దిగ్భ్రమను కలిగించిన సమయాలు చాల ఉన్నాయి. 'నేమన్నట్టే ఈమెకు తెలీదా? తెలిసే ఈ నటనా? కనీసం ఒక పల్చనిబట్టనైనా ఆచ్ఛాదన చేసికోవచ్చుకదా!' అని వితర్కించుకుని ఆమె స్నానం చేసేంతవరకూ గదిలోకిపోయి కూర్చున్న సమయాలు చాల ఉన్నాయి. భోజనంచేసి కంచెవతల మంచం వాల్చుకుని, ఏదో సినిమాపాటనో పల్లె పదాన్నో నెమ్మదిగా పాడటం నిద్ర వచ్చేంతవరకూ శాస్త్రికి గుర్తే.

ఉదయంవేళ చెంబుపుకు వెళ్లొచ్చి పెరటిలో ముఖప్రక్షాళనచేసే సమయానికి బిందెతో, తాటాకు రేకతో వచ్చిపడుతుంది చంద్రి శాస్త్రి ఇంటివెనుక నున్న బావిదగ్గిరికి. ప్రక్కనున్నవారితో ఎగసక్కాలు, మాట విసుర్లు, నవ్వులాటలు, శాస్త్రివైపు విసిరే చిలిపిచూపులు, శాస్త్రికి వినిపిస్తూంటాయి, కని పిస్తూంటాయి. కట్టిన కలనేతచీర కుచ్చిళ్లలో కుడి భాగాన్ని బొడ్లోదోపి, తెల్లగా మెరిసే శరీరాన్ని కాంతి బయటికి వెదజల్లేందుకు కాబోలు వదలి, నడుముచుట్టూకి చీరకొంగునుతెచ్చుకొని, ఏమాత్రం జారినా రెండు వక్షోజాలను తప్పించుకొని వాటి రెండిటిమధ్య పడేటట్టు పయ్యెదను సరిచేసికొని కొంగు చివర్ని బొడ్లోదోపి, బిందెను నడుము కెత్తు కుని, బావి ముందునుండి కదిలేటప్పుడు నామ మాత్రంగా ఒక్కసారి పయ్యెదను సర్దుకుని, ఒక్క సారి ఒక మందహాసాన్ని, చిలిపి చూపును శాస్త్రివైపు విసిరి కాలిఅందియలధ్వనిచేసికుంటూ మోచేతి వరకూ ఉన్న గాజులనుండి సంగీతాన్ని సృజించు కుంటూ తలలోనున్న పువ్వులవాసనలతో శాస్త్రికి ఏవో వలపుసందేశాలపంపే చంద్రిభావం శాస్త్రికి ఏనాడో అర్థమైంది. చంద్రి మనోగతాన్నెరిగిన శాస్త్రి చలించకపోవటానికి కారణాలు మూడేమూడు. ఒకటి —మేనమామకూతురు విజయ రూపం కళ్ల ముందు మెదలటం; రెండు—గడించుకున్న మంచి తనాన్ని మంటగలుపుకొని భవిష్యత్తును పాడుచేసి కోవటం; యిష్టంలేకపోవటం; చిన్ననాటను తండ్రి చదివించిన ప్రవరాఖ్య చరితము, రామాయణముల మూలములు అతనిలో గాఢంగా నాటుకొనిపోయి అతనిలో పదేపదే ధ్వనించటమూ కారణాలు. హరిశ్చంద్రుడు ఒక్క అబద్ధమాడితే అన్నికష్టాలుపడే

వాడా? అనేవారి వాదనను అంగీకరించడు శాస్త్రి. ధర్మరాజుకు చివరికి మిగిలిందేమిటి శ్మశానంకాక అనే వారిని సమర్థించడు. కర్ణుని దానశీలతను తెగడే వారిని దరిచేరనివ్వడు. రామాయణం అభూతకల్పన అనేవారితో మాటాడడు. ఉదయాన్నే స్నానంచేసి సంధ్యావందనం చేస్తేగాని పచ్చిమంచినీళ్ళు నోట్లో పోసికోడు. గాయత్రీమంత్రాన్ని చెప్పుకుంటేగాని విస్తర్ని ముట్టడు; పూటకూళ్ళమ్మ యింట్లో జరిగే మడిగురించి, శాస్త్రి ఆచారంగురించి అంతా చూచి నవ్వుకుంటూంటే చూచిచూడనట్టు ఊరుకుంటాడు శాస్త్రి. సిరిరామపురంలో జరిగిన మోసాలు, కుట్రలు, దోపిడీలు, హత్యలుగురించి విన్నాడు శాస్త్రి. కాని విననట్టే ఉండిపోయాడు. అక్కడున్న రాజకీయపార్టీలన్నీ తెలుసు. కాని తెలియనట్టే ఉండిపోయాడు. మంచిని సంపాదించుకోవాలనే ప్రయత్నమేతప్ప ఇంకోటేదీ అతడి దృష్టిలోలేదు. ఎవరో తప్ప ఊరంతా ప్రత్యేకంగా మంచివాడుగా ఏనాడూ చెప్పుకోలేదు. శాస్త్రి చివరికి తన గురించి అంతా మంచిగా చెప్పుకోవాలనే కోరికనుకూడ పదిలపరచుకోలేకపోయాడు. చెడ్డగా చెప్పుకోకుండాఉంటే చాలు అన్నదే అతని కోరిక. ఎన్నికష్టాలైనాపడి యజమాని మనసును మెప్పించి, టవునులోనున్న బట్టలషాపులో ఉద్యోగాన్ని సంపాదించుకొని, ఉద్యోగం దొరికినవెంటనే గర్వంగా మేనమామ యింటికివెళ్ళి అతనిముందునిలబడి అంతకన్నా గర్వంగా విజయను పెళ్ళిచేసికొని టవునులో కాపురం పెట్టుకొని జీవితాన్ని స్వర్గమయం చేసికోవాలనుకునే శాస్త్రి ఏనాడూ చంద్రివైపు చూడదలచుకోలేదు.

నిజానికి చంద్రి గురించి ఆలోచించేందుకు సమయంకూడా చిక్కేదికాదు శాస్త్రికి. ఒకవేళ ఎప్పుడైన తీరిక దొరికితే కరణంగారింటి అరుగు మీదకు చేరేవాడు. ఆయనకు సంగీత సాహిత్యాల మీద ఆసక్తి జాస్తి. ఏవేవో రాగాల ఆలాపనచేసే వాడాయన. ఆ వేడిలోనే శాస్త్రికూడ గొంతెత్తి పాడేవాడు శ్రావ్యంగా జయదేవుని అష్టపదులను. శాస్త్రిగొంతు కరణంగారినేకాక పలువురిని విశేషంగా ఆకర్షించేది. వీలుచిక్కినప్పుడల్లా పాడించుకొని కాఫీ యిచ్చిపంపేవాడాయన. ఒక్కొక్కప్పుడు ఆ వూరి హైస్కూల్లో పనిచేస్తున్న సైన్సు మాష్టరు యింటికి కాలు సాగించేవాడు. ఆయనకు చిత్రలేఖనం మీద ఆసక్తి ఎక్కువ. ఒంటిగా గదిలో కూర్చుని పగలనక, రాత్రనక భోజనంకూడా మానేసి, బొమ్మల్ని గీసేవాడు. శాస్త్రి కనిపించినప్పుడల్లా పిలిచి తాను గీసిన బొమ్మలు చూపేవాడు. ఒక్కొక్క రోజు రాత్రిళ్ళు రామాలయం అరుగుమీద భద్రయ్య తాత చేసే తత్త్వబోధ వినడానికి వెళ్ళేవాడు. ఎవరూ దొరకనినాడు స్కూలుగ్రౌండులోనున్న పొన్నచెట్ల క్రింద ఏకాంతంగా కూర్చునేవాడు విజయ గురించి ఆలోచిస్తూ. ఆ విధంగా ప్రశాంతంగా జీవితాన్ని గడుపుతున్న శాస్త్రిని చలింప చేయలేకపోయింది చంద్రి.

శాస్త్రి చూపిన విముఖత చంద్రిలో ఎంత మదనతాపాన్ని కలుగజేసిందో అనుభవించిన ఆమెకే తెలియాలి. చంద్రికి దూరంగా ఉండటానికి మరే యింటికైనా పోదామనుకున్నాడు. కాని అంత తక్కువ అద్దె (నెలకు 2½ రూ॥)లో అన్ని సౌకర్యాలుగల యిల్లు దొరకటం అసాధ్యమని తెలిసి ప్రయత్నాన్ని విరమించుకున్నాడు శాస్త్రి.

శాస్త్రి, దీపావళిపండుగనాటికి ఆ ఊరుచేరి ఏడాదైంది. దీపావళివెళ్ళిన నాలుగురోజుల తరువాత ఒకనాడు రాత్రి ఎనిమిది తొమ్మిది గంటలప్పుడు భోంచేసి పడక కుర్చీలో కూర్చుని దీపపు బుడ్డి వెలుగులో తెలుగు మాష్టారింటినుండి తెచ్చుకున్న ప్రత్యేక సంచిక నొకదాన్ని తిరగవేస్తున్నాడు. అంతలో చంద్రిపాకవైపునుండి 'అమ్మో! అమ్మో!' అన్న కేకలు విని ఒక్క ఉదుటునలేచి పుస్తకాన్ని గిరవాటువేసి ముందుకు పరుగెత్తాడు. తులిసి కోటముందు స్నానం చేసి పొడి చీరకట్టుకొని నిలబడిన చంద్రి చీర తులసమ్మ ముందున్న దీపానికి అంటుకొని మండటం, చంద్రి నిస్సహాయంతో కేకలు వేయటం చూచాడు

శాస్త్రి. కంచెదాటి పరుగెత్తి మండుతున్న చీరను ఆర్ప ప్రయత్నించి విఫలుడై సాహసించి ఆమె కటి ప్రదేశంనుండి లాగిపడేశాడు వ్యవధిలేక గత్యంతరం లేక. అతిసులభంగానే ఊడొచ్చేసింది చీర. అంటుకున్న చీర తులసమ్మ ముందు మండుతూంటే చంద్రి రూపం పూర్తిగా వెలుగులో కన్పించుతూంటె, శరీరాన్ని పూర్తిగా దాచుకోవాలనో, భయంచేతవో, మరి ఏ కారణంచేతనో శాస్త్రిని గట్టిగా వాటేసికుని అతని భుజం మీద తలవాల్చి ఉండిపోయింది చంద్రి కళ్లుమూసికొని. చంద్రి స్పృహతప్పటాన్ని గమనించి నెమ్మదిగా పాకలోకి తీసికెళ్లి నులక మంచంమీద పరుండజెట్టి దండెంమీద వ్రేలాడుతున్న చీర నొకదాన్ని ఆచ్ఛాదనగాకప్పి, ముఖంమీద నీళ్లు చిలకరించాడు నెమ్మదిగా. చంద్రి కనులెత్తి చూచి భయంతో, శాస్త్రిని వాటేసికుని ఉండిపోయింది. శాస్త్రికి సిగ్గు, భయం రెండూ కలిగాయి. నెమ్మదిగా ఆమెపట్టును వదిలించుకొని, ఆమె శరీరంమీద చీరను సరిగాసర్ది భయపడవద్దనిచెప్పి దాహం వేస్తున్నదంటే గొంతులో మంచినీళ్లుపోసి యివతలపడ్డాడు ఏదో పాపంచేసిన వాడిలా. అంతవరకూ చంద్రితల్లి యింట్లోలేదని, ప్రక్క ఊరు చెల్లెలిదగ్గరకు వెళ్లిందని తెలీదు శాస్త్రికి.

అదెలా జరిగిందోగాని మర్నాటి ఉదయం ఊరంతటికీ తెలిసింది, చంద్రి చీర అంటుకున్నట్టు, శాస్త్రి ఆర్పినట్టు. అంతేకాకుండ ఆ రాత్రంతా శాస్త్రి చంద్రితోనే ఉన్నాడన్నవార్త ఎలావచ్చిందో అర్థం కాలేదు శాస్త్రికి. అంతక్రితం రాత్రి ఏమీ జరగనట్టే కిలకిల నవ్వుతూ, చిలిపి చూపులను విసిరే చంద్రిని చూచిన తరువాత శాస్త్రి మనసు శంకతో మూలిగింది.

ఊరిలో ఏ కొద్దిమందోతప్ప మిగతావారంతా శాస్త్రిని అదోరకంగా చూస్తూంటే ఒంటిమీద కిరసనాయిలుపోసి మండిస్తున్నట్టనిపించింది శాస్త్రికి. వారి గుసగుసలు, కాలుతున్న తన శరీరాన్ని బాకులతోనూ, ఈటెలతోనూ పొడిచి హింసిస్తున్నట్టనిపించింది.

ఆ రోజు రాత్రి వకౌనంగా వీధిలో కూర్చున్న శాస్త్రి నుద్దేశించి అతడు చేసిన సహాయాన్ని పొగుడుతూంటే చంద్రిమాటలు వింటూ మనసులో అనుమానాన్ని బహిర్గతం చేయక ఉండిపోయాడు శాస్త్రి.

'మీరే లేకపోతే నేనేమైపోదును బాబూ!' అని చంద్రి కళ్లలోకి నీళ్లు తెచ్చుకుని అంటూంటే—

'నే చేసిందేముందిలే, ఆపదలోవున్న వారికి ఎవరైనా చేస్తారామాత్రం. పాపం రాత్రయినట్టుంది' అన్నాడు శాస్త్రి.

'ఎల్తాను బాబూ!' అంటూ వెళ్లిపోయింది చంద్రి.

ఆ నాటినుండి చంద్రి ఏదో విధంగా శాస్త్రిని మాటాడించ ప్రయత్నించటం, అతను తప్పుకోవటం జరుగుతునే ఉంది.

కార్తీకమాసం వచ్చేసింది.

ఆ రోజు మొదటి సోమవారం. శాస్త్రికి ఉపవాసం ఉండే రోజు. ఉదయాన్ని తలస్నానం చేసికొని శివాలయానికివెళ్లి దైవదర్శనం చేసికొనివచ్చాడు. ఉదయాన్నే చంద్రి తలస్నానంచేసి ముఖాన్న అంటీ అంటనట్టు పసుపురాసుకొని, నయాపైసా అంత బొట్టుపెట్టుకొని అంతక్రితం రోజు మడిగా ఆరేసుకున్న చీరను, గోచీ పోసికొని కట్టుకొని, తలలో మెడమీదకు జీరాడేటట్టు కనకాంబరాలు, చామంతి పూలు కలిపిన దండను పెట్టుకొని పూలు పండ్లు పట్టుకొని శివాలయానికి వెళ్లొచ్చింది ఉదయాన్నే. సాయంత్రం తోటనుండివచ్చి తలస్నానంచేసి పొడిబట్టలు కట్టుకొని శివాలయానికి బయలుదేరనున్న శాస్త్రికి, కంచెదగ్గర నిలబడి ఆకాశంలోకిచూచే చంద్రి కనిపించింది. ఆమె ముఖంలో అలసటను చూచి, ఆ రోజు ఆమె ఉపవాసమున్నదని గ్రహించాడు శాస్త్రి.

భోజనంచేసి వాలు కుర్చీలో కూర్చున్న శాస్త్రి ముందు చాలసేపు తారాడింది చంద్రి కూనిరాగాలు తీస్తూ. తొమ్మిది గంటలు కాకముందే ఎవరిగూళ్ళలో

వారు పడుక్కున్నారు. చలిగాలి వీస్తున్నది. లెఖలేవో చూచుకోవాలని నాయుడు గారింటికివెళ్ళి ఒక గంట ఉండి వచ్చాడు శాస్త్రి. ఆ వేళకి వెన్నెల పుచ్చ పువ్వులా కాస్తోంది. మేఘాలు మచ్చుకైనా లేవు ఆకాశంలో. ఇంటిని సమీపించి, యథాలాపంగా తాళం తీస్తున్న శాస్త్రి, వీధిలో తడకప్రక్క ఎవరో సిల బడటంచూచి, దృష్టిని సారించి 'ఎవరదీ?' అన్నాడు.

ఆ ఆకారం మాటాడలేదు. తీసిన తలుపుల లోనికి నెట్టుతూ రెట్టించాడు ప్రశ్నను.

ఆకారం అతని దగ్గరగావచ్చి గుమ్మానికి దగ్గరగావచ్చి 'నేనే! సెంద్రిని' అంది.

'ఎందుకొచ్చావ్?' అన్నాడు కఠినంగా.

'తలకాయ నెప్పి మందు కోసరం' అంది చంద్రి, శాస్త్రిని ఓరకంట చూసి కణతలు నొక్కుకుంటూ.

'అయ్యో! పాపం! కారణం తెలిసికోకుండ ఎందుకంత కఠినంగా మాటాడాను!' అని అనుకుంటూ 'ఉండయితే ఏ మూల ఉందో చూస్తాను' అంటూ అగ్గిపెట్టెను వెతికి బుడ్డి దీపాన్ని వెలిగించాడు. వెతికి వెతికి అమృతాంజనమును తీసివెనుతిరిగాడు. వెనుదిరిగిన శాస్త్రికి, ఒక కాలు మంచంమీదనుండి నేలవైపుంచి కాలూపుతూ, రెండు చేతులను తల క్రిందనుంచుకొని మంచంమీద చిలిపిగా నవ్వుతూ వెల్లకితల పడుక్కున్న చంద్రి కనిపించింది. అర్థమైంది శాస్త్రికి, చంద్రి కే తలనొప్పిలేదని, అంతా నటన అని.

'అయితే తలనొప్పి లేదన్నమాట' అన్నాడు పళ్ళు నొక్కిపట్టి.

'ఊహూ!' అంది చంద్రి ధోరణినేమాత్రం మార్చకుండ.

'అయితే ఎందుకొచ్చావు?' కఠినంగా అడిగాడు.

'తెలియలేదా?' అంది చంద్రి కాలూపటం ఆపి.

'అది తరువాత చెప్తాను. పద అవతలికి'

'ఏ ఏ!' అంది చంద్రి పోనన్నట్టు. ఆమె గుండెమీద ఆచ్ఛాదం పూర్తిగా జారిపోయింది. చంద్రి తానున్న పరిస్థితికి ఏమీ విచారపడటంలేదని గ్రహించి 'ముందు మంచంమీదనుండి లేస్తావా? లేవవా?' అన్నాడు శాస్త్రి.

లేవనన్నట్టు తలూపింది నిర్లక్ష్యంగా చంద్రి.

'మెడపట్టి గెంటితేనేగాని లేవవన్నమాట' అన్నాడు.

'ఏ. ఏ. సేసేదేటో సేసి సూపించు' అంది ధీమాగా కాలుపుతూ.

'అదే చూపిస్తాను' అంటూ ఆమె రెండు చేతులను పట్టుకొని గట్టిగా గుంజాడు. ప్రయాస నివ్వకుండానే మంచంమీదనుండి లేచి తూలిపోయే శాస్త్రిని గట్టిగా పట్టుకుంది. ఒదుల్చుకోలేనంత గట్టిగా ఉందాపట్టు. 'ఛీ! రాక్షసీ! వదులు' అంటూ బాదసాగాడు. బాధబదులు ఆమె ముఖంలో ఆనందం కనిపించింది. అర్థమైంది శాస్త్రికి. తాను బాధ పెట్టాలనిచేసే ప్రతీపని ఆమెను ఆనందపరుస్తుందని. గత్యంతరం కనిపించలేదు శాస్త్రికి.

చేతులెత్తి దండంపెట్టి 'తల్లీ! నన్నొదులు' అన్నాడు.

నిశ్చేష్టురాలై వదిలేసింది చంద్రి శాస్త్రిని.

'నా జోలికి రాకు తల్లీ! పరువుగా మర్యాదగా బ్రతుకుదామని, బ్రతుకుతున్నానని యింతవరకు అనుకుంటున్నాను నన్ను అపవిత్రుణ్ణి చేయకు. నా పరువు కాపాడు నా బతుక్కి ఒక బాటపడితే ఈ ఊళ్లో ఒక క్షణం ఉండను అంతవరకూ......' అని ఆగిపోయాడు. మోడ్చిన చేతులు అలానే ఉన్నాయి.

శాస్త్రి కళ్ళలో దీనత్వం చూసింది చంద్రి.

ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'శా! నాకు దణ్ణ మెట్టకండి బాబూ! మీరిలాంటోరనుకోనేదు' అంటూ చేతుల్ని విడదీసింది చంద్రి.

తలపట్టుకొని మంచంలో కూలబడ్డాడు.

'ఎల్తాను బాబూ!' అంటూ గుమ్మంవైపు కదిలి అంతలోనే వెనుదిరిగి చంద్రి అంది. 'బాబూ! ఏటనుకో పోతే నాదో పెస్నె. నాకేటి అర్థం కానేదు సెప్పవిూ. ఎంకునాయుడేటి? సూరినాయుడేటి, మల్లి పూజారయ్య, కాపీ కొట్టు సెలపతి, సుబద్ద రమ్మ కొడుకు సెందిరినాయుడు; మరిశానమంది, మనూరికి ఈ సుట్టుపక్కలకి పెద్దోరే కదాబాబూ! మరి అలాటి పనులెన్ని సెయ్యలేదు? పూజారయ్య తండ్రి సూడని పడుచు పిల్ల ఉండదా యింత వరకూ! అయినా ఆరు గొప్పోరు. పెదోరే కదా బాబూ! మరి మరియాద విూకేన పోతది? విూ బతు కేనా సెడుద్ది?'

చంద్రి ప్రశ్నతో ఆలోచనలోపడ్డాడు శాస్త్రి. శాస్త్రి ఆలోచనలో పడడంచూచి తన ప్రసంగాన్ని కొనసాగించింది చంద్రి: 'నలుగురనుకుంటారనేగా విూ బయం? మరి ఈ ఊరంతా అలాటోరుకారా? ఎవరోతప్పం. ఊరినున్న మగాళ్ళని సెప్పమనండి గుండెవిూద సెయ్యేసుకొని ఏనాడూ ఏ ఆడదాన్ని ముట్టలేదని. ఆరికిపోని మరియాద విూకేనాపోద్ది? బుడ్డితాగి, తందనాలాడి, ఇలాంటిపనులు సేస్తేనే వస్తాది పరువు, మరియాద. విూనాగ ఉంటేరాదు పంతులూ, మరియాద?' అంది చంద్రి.

చంద్రి మాటల్లో ఏదో సత్యం గోచరం కాసాగింది శాస్త్రికి. కాని పూర్తిగా విశ్వసించ టానికి మనసు రాలేదు. స్త్రీని పవిత్రంగా చూచే మహానుభావుల చరిత్రలు మనసులో మెదులుతూంటే, చంద్రిమాటలు చెవులో రింగుమంటూంటే సమా ధానం దొరక్క ఉండిపోయాడు కొద్దిసేపు ఏదో మాటాడదామని ప్రక్కకు తిరిగిన శాస్త్రికి చంద్రి కనిపించలేదు. కంచె అవతల చలిలో మంచంవిూద బోర్లాపడుకున్న చంద్రి కనిపించింది శాస్త్రికి.

మర్నాడు రాత్రి తొమ్మిది గంటలవుతూండగా భోజనంచేసి కొద్దిసేపు కరణంగారి అరుగువిూద కూర్చుని, మరి కూర్చోలేక ఇంటికి వచ్చేసాడు శాస్త్రి. కంచె దగ్గర చంద్రి నిలబడి ఉంది. చంద్రిని గమనిస్తూ తలుపుతీసి దీపం వెలిగించాడు. తలుపు వైపు తిరగ్గానే గుమ్మదగ్గర నిలబడ్డ చంద్రి కని పించింది.

'చంద్రీ' అన్నాడు శాస్త్రి.

శాస్త్రి గొంతుకలో కొంతమార్పును గమనించి ఆశగా 'బాబూ!' అంది చంద్రి.

'నిన్న తలనొప్పిమందునుగాని నీకు యిచ్చానా?'

'లేదు బాబూ! ఏం?' అంది కొంత ఆదు ర్దాతో.

'తలభారంగా ఉంది. నిన్నా సందట్లో ఎక్కడో పడేశాను' అంటూ వెతకసాగాడు శాస్త్రి.

కొద్దిసేపటికి దొరికింది అమృతాంజనం. 'దొరికిందిలే చంద్రీ! నీ దగ్గరుందేమో అనుకున్నాను' అంటూ మందును తలకు పట్టించుకున్నాడు. శాస్త్రి మంచంవిూద పడుక్కొని మెడవరకూ దుప్పటి లాక్కోవడంచూచి 'సలిగా ఉందా బాబూ! ఊష్టంగాని.........'

'లేదు చంద్రీ! చలేస్తోందంతే! వెళ్లేటప్పుడు తలుపు దగ్గరేసి వెళ్ళు' అన్నాడు కళ్ళుమూసికుంటూ.

'అట్టాగే బాబూ!' అంటూ తలుపు దగ్గర కేసి వెళ్ళిపోయింది చంద్రి.

ప్రతిదినం ఆరుగంటలకన్నా ముందే లేచే శాస్త్రి ఆ రోజు ఉదయం ఏడుగంటలైనా లేవక పోవడం గమనించి నెమ్మదిగా తలుపు తోసిచూసింది చంద్రి. మంచంవిూద మూలుగుతూ పడుక్కున్న శాస్త్రి కనిపించాడు. ఆదుర్దాతో అతని చెంప లను, నుదిటిని తాకిచూసింది. ఒళ్లు కాలి పోతోంది. వేడిగా కాళ్లను ముడుచుకుని పడు క్కున్న శాస్త్రి చలికి వణికిపోతున్నాడు. రెండు మూడుసార్లు పిలిచింది చంద్రి శాస్త్రిని. నెమ్మదిగా కళ్లెత్తిచూచి కళ్ళు మూసి కున్నాడు శాస్త్రి. చంద్రికేం తోచలేదు. గబగబా

పూజారయ్య దగ్గరికి పరుగెత్తింది చంద్రి. కొద్ది సేపటిలో పూజారయ్యను వెంటపెట్టుకొని వచ్చింది చంద్రి. అతను చూసి కడుపులోకి మందిచ్చి 'జాగ్రత్తగా చూడవే! మరి నిన్నరాత్రే ఎందుకు చెప్పేవుకదూ, మందిద్దును. మరేంకాదు. మలేరియా జ్వరం. కార్తీకమాసం స్నానాలూ, ధ్యానాలూ చేయించావా ఏమిటి? జాగ్రత్తగా చూచుకో. తగ్గిపోతుందిలే కంగారు పడకు' అంటూ ముట్టుకునేంత దగ్గరగావచ్చి కళ్ళజోడు సవిరించుకొని వీధిలోకి వెళ్ళిపోయాడు. అతని మాటల్లో అర్థాన్ని గ్రహించిన చంద్రి 'ఛీ! ఏం మడిసి!' అనుకుంది మెటికలు విరుస్తూ.

వెంటనే కాఫీపొడి, పంచదార బజారునుండి కొనితెచ్చి కాఫీ కాచి, మందుపట్టి కాఫీ త్రాగించింది. కాఫీ త్రాగి తెరపినపడిన శాస్త్రి కాళ్ళుచేతులు గింజుకోవటం చూచి, నుదిటికి అమృతాంజనం పట్టించి, కాళ్ళను చేతులను ఒత్తసాగింది కొంతసేపటికి నిద్రపోయాడు. అలా నిద్రపోయిన అతన్ని చూస్తుంటే చంద్రి కళ్ళు జాలిగా చమర్చాయి. ఆరోజు పనిలోకి వెళ్ళలేదు. చంద్రిని పనిలోకి పిలవాలని ఎవరొచ్చినా 'సాస్తుర్లు బాబుకు జొరం. రెండుదినాలు పనిలోకి రాను' అని చెప్పి పంపేసింది. ఆ రోజంతా జ్వరంగానే ఉంది శాస్త్రికి. రెండుమూడుసార్లు కాఫీ తాగించింది అతనిచేత. సాయంత్రం పూజారయ్య రాలేదు. రాత్రి జ్వరం ఎక్కువైంది శాస్త్రికి. చలిగూడా ఎక్కువైంది. కప్పుకున్న పల్చటి దుప్పటి చలికాగలేదు. ఒణికిపోయే శాస్త్రిని రెండుచేతుల్లోకి తీసికొని వాటేసుకుంది చంద్రి. మరిగిన నీటిని ఒంటిమీద పోసికున్నట్టనిపించింది చంద్రికి. కాని శాస్త్రిచలి తగ్గలేదు. కడుపులోంచివచ్చే చలి వెలా ఆపాలో తెలీలేదు చంద్రికి గబగబా కాఫీచేసి వేడివేడి కాఫీ పెట్టింది చంద్రి. ఆతృతగా త్రాగాడు శాస్త్రి. కాళ్ళుచేతులు పడుతూంటే నిద్రపోయాడు. ఆరోజు అన్నం ముఖం చూడలేదు చంద్రి. అలసిపోయిన చంద్రి నీరసంతో అతనితోపాటే అతనిమీద ఒరిగి నిద్రపోయినసంగతి మరునాటి ఉదయం మేలుకునేంతవరకూ చంద్రికి తెలియదు. మరునాడు పూజారయ్య మందు మార్చాడు. ఆరోజు కూడా శాస్త్రిని కనిపెట్టఉంది చంద్రి. ఆరాత్రి పదిగంటలకు జ్వరం తగ్గింది. చమట పట్టిన బట్టలు తీసివేసి పెట్టెలోవున్న చాకలి నుండొచ్చిన బట్టలు తొడిగించింది చంద్రి. మర్నాడు పూజారయ్య రొట్టె తినిపించాడు శాస్త్రిచేత. కడుపులో కాస్తపడ్డ తరువాతగాని తెలియలేదు, సెలవు పుచ్చుకోకుండ తా నుండిపోయాడని. మర్నాడు శక్తితెచ్చుకొని వెంకునాయుడి తోటవైపు వెళ్ళాలని ప్రయత్నించాడు. కాని చంద్రే ఆతని ప్రయత్నాన్ని ఆపింది. శాస్త్రి భోజనంచేసే పూటకూళ్ళమ్మ యింటినుండి అన్నం మెత్తగా వండించి చారు పోయించి తెచ్చి శాస్త్రిచేత తినిపించింది. తనకోసం అంత శ్రమపడుతున్న చంద్రిని చూచి జాలిపడ్డాడు శాస్త్రి. ఆదివారంనాడు కూడా యిల్లు కదలనీయ లేదు చంద్రి.

సోమవారంనాడు చాల ఉత్సాహంగా బయలుదేరాడు శాస్త్రి యింటినుండి. అతడు యింటినుండి ఆరోగ్యంగా బయలుదేరుతూంటే ఏదో విజయాన్ని సాధించినదానిలా అతన్ని చూస్తూ ఉండిపోయింది. శాస్త్రి వీధిలోకి బయలుదేరి అందరూ తనవైపే ప్రత్యేకంగా చూడటంతో కొంత తికమకపడిపోయాడు. కాఫీహోటల్లో చలపతి ఎవరికో కాఫీ ఇస్తూ శాస్త్రిని గమనించి, గమనించనట్టు శెట్టితో 'ఇంతకీ చెంద్రి పంతుల్నుంచుకుందో, పంతులే చెంద్రి నుంచుకున్నాడో తెల్దుగాని పంతులుమాత్రం అదృష్టమంతుడే. పైకలాఉన్నా గట్టోడు' అన్న మాటలు విని కుతకుతలాడిపోయాడు శాస్త్రి. రచ్చబండదగ్గర, రామమందిరం సావిడిలో, తోటలో, ఎక్కడచూచినా చంద్రి శాస్త్రిని ఉంచుకున్నాదనుకునేవారే కనుపించారు. కరణంగారు రహస్యంగా పిలిచి 'నిజమేనా? నమ్మదగ్గదేనా?' అడిగేసరికి మరింత బాధపడిపోయాడు. నిజంచెప్ప చేతకాలేదు. నిజాన్ని ఉన్నదున్నట్టు చెప్పడానికి కూడా నేర్పరితనం కావాలి

మరి. గుండెను మంటల్లో పెట్టి కాల్చినట్లయింది శాస్త్రికి. మధ్యాహ్నం భోజనం చేయక తోటలోనే ఉండిపోయాడు. నిమ్మకాయల లెక్క, అరటిగెలల లెక్కతేల్చి సాయంత్రం యింటికి బయలుదేరే వేళ పట్నంలో రెండు రోజులుండి తిరిగొచ్చిన వెంకునాయుడు తోటలోకివస్తూ కనిపించాడు. అతడు వస్తూనే,

'పంతులూ! నీవెంతో మంచివాడివని అనుకున్నాను. ఊరంతటికి చెడ్డపేరు తెస్తావనుకోలేదు. నీవు నా దగ్గర ఉండడం నాకే నామోషి. ఈ రోజు వరకూ నీ జీతం ఇదిగో. ఉదయాన్నే తిన్నగా మీ ఊరెళ్లిపో. ఇక్కడ ఉండమాక. గొడవలొస్తాయి' అంటూ డబ్బు అందించాడు.

వెంకునాయుడి మాటలు వింటూ నిరుత్తరుడై పోయాడు శాస్త్రి. అతను కట్టుకున్న మేడలన్నీ కూలినట్టనిపించింది. యాంత్రికంగా వెంకునాయుడిచ్చింది పుచ్చుకుని యింటివైపు బయలుదేరాడు ఇంటి తలుపు తీసికొని దీపం వెలిగించుకోకండా మంచంమీద కూలబడ్డాడు వెంకునాయుడి మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తూంటే తలపట్టుకుని 'చివరిరాత్రి' అని గొణుగుకుంటూ ఉండిపోయాడు. రాత్రయిపోయింది. శాస్త్రి గదిలో దీపం లేక పోవటం చూచి చంద్రి దీపం వెలిగించి తలపట్టుకునికూర్చున్న శాస్త్రిని చూసి ఆదుర్దాతో 'మల్లా ఒంట్లో ఉష్టంగాని... వచ్చిందా?' అని అడిగింది

'ఉహూ!' అన్నాడు తలవిూంచి చేతులు తీసివేసి.

'మరి?'

'ఉద్యోగం పోయింది'

'ఎలా?'

కారణాన్ని చెప్పాడు. చంద్రి కొంచెంసేపు మాటలేకుండ ఉండిపోయింది. అవతల ఏదో అలికిడి అయింది.

నా మూలకాన్నే కదా ఉద్యోగం పోయింది మీకు?' అంది చంద్రి.

'ఛా! అలా అనకు చంద్రీ! నీవు దేవతవు. నీవేగాని ఆ రోజు డాక్టర్నితెచ్చి, నా గొంతులో కాఫీ నీళ్లుపోయక, మందిప్పించక నన్నలా వదిలేస్తే నేనేమయ్యేవాడిని? ఈనాడు నిన్ను నన్ను అంటున్న వారెవరైనా తోటి మానవులుగా నీవు చేసినపాటి చేసారా? నీ వలన నా ప్రాణాలు నిలిచాయి. నీవు దేవతవి. ఈ ఉద్యోగం పోయిందన్న విచారం నాకేకోశాన్నలేదు. అనవసరంగా ఒక నిందను నెత్తిమీదనువేసికొని పోతున్నాను. అందుకే బాధగా ఉంది' అన్నాడు నిట్టూర్పుతూ.

'సత్తెం. సత్తెపెమాణంగా మీలాటోరు నూటికి ఒకరో ఇద్దరో. మీలాంటోరిమీద నింద వెయ్యటానికి మనసెలా ఒప్పినాది? సత్తెం, దరమం అక్కరలేదా?'

'అంతే చంద్రీ! వారికి సత్యాసత్యాలతో పనిలేదు. కళ్లకు కనిపించేదంతా సత్యమే. నిజానికి నీకు నాకు ఏలాంటి సంబంధం లేదు: అది నీకు తెలుసు. నాకు తెలుసు. కాని లోకానికది ఎలా తెలుస్తుంది? తెలియదు. తెలిసే అవకాశం లేదు. అందుకే నాకు బాధగా ఉంది. నీవు నిజాన్ని చెప్పినా ఎవరూ నమ్మరు. ఈ నిందను మోసికుంటూ పోవలసిందే. అంతకన్న గత్యంతరం లేదు. అందుచేత అలానే వెళ్తాను ఒకనాడు నీవు నాకు హితబోధ చేసావు. తాగితందనాలాడితే, మరింకేవో అసభ్యకరమైన పనులుచేస్తే పరువు మర్యాదలు వస్తాయని, అలా ఉండమని. అదెంతవరకూ నిజమో నాకు తెలీదు. నాకలా ఉండబుద్ధికాదు. ఎవరేది చేసినా ఒకరికోసం కాదు. తనకోసమే. పవిత్రంగా ఉండడం పదిమంది కోసం కాదు. వారు హర్షిస్తారనికాదు. నాకు తెలుసు అలా ఉంటే హర్షించరని. అది నా కోసం. నాలో రక్తం యింకే భావాన్ని ప్రవహింపచేయదు. ఒక వేళ నీవు అడగవచ్చు 'పడిననింద ఎలానూ పడింది గదా, అలా ఉంటేనేం? పద్ధతి మార్చుకోకూడదా?' అని—ఇదికూడా పదిమందికోసం కాదు. నాకోసం. నా తృప్తికోసం. పైనున్న భగవంతుడికోసం. పది

మందిమాటే నిజం చేస్తామా? ఎప్పటికీకాదు. నాకు తెలుసు, నేను ఎండిన వాగులో జలశేషాన్ని. ఉరకలెత్తుతున్న క్రొత్తవాగు నన్ను వెంబడించి నన్ను సజీవసమాధి చేస్తుందని నాకు తెలుసు. భగవంతుడున్నాడు. నన్ను ఏ పల్లపు గుంటలోకో ఈ వాగు బారినుండీ తప్పించి చేర్చుతాడు. అలా కాకపోయినా నాకు సంతోషమే. నేను చెడలేదు. ఆ తృప్తి చాలు. నీవు నన్నుకన్న తల్లిలాంటి దానివి. నాకు ప్రాణాన్నిచ్చిన దేవతవు. ఉదయాన్నే ఊర్ని విడిచిపెట్టాలని ఆజ్ఞ. అందుచేత త్వరగా సామాను సర్దుకోవాలి. నీవు ఉన్నా నా కభ్యంతరంలేదు. చివరిసారిగా ఒక్కమాట. నా భాష నీ కర్థమవుతుందో లేదో; అయినా చెప్తున్నా విను. పురుషుడిన్నైనా, స్త్రీనైనా ఎప్పుడైనా మిగతా లోకాన్ని చూచి అంచనా వెయ్యకు ఎవరి విలువలు వారికున్నాయి. ఉంటాయి. పురుషుడంటే తాగితందనాలాడి మరో విధంగా జీవితాన్ని గడిపేవాడని, స్త్రీ అంటే మగవాడిచేతిలో కీలుబొమ్మని, శీలము లేనిదని మాత్రం ఏనాడూ అనుకోకద్దు. ఇద్దరూ పూజనీయులే. వాగు పరుగెత్తుకుంటూ వస్తోంది. నేను పల్లంలోకి త్వరగా సురక్షితంగా చేరాలి' అంటూ లేచాడు శాస్త్రి.

చంద్రి కళ్లలో కన్నీళ్లు నిండి ఆమె చెక్కిళ్లపై జారాయి.

పంతులు నుంచుకున్నాదన్న చంద్రి, పంతులితో పాటు, ఆ రాత్రే ఎక్కడికి పారిపోతుందోఅని ఆత్రుతతో చంద్రిని పారిపోకుండ ఆపటానికి స్వయంగా వచ్చిన వెంకునాయుడు, వారి మాటలు విని చమరిన కళ్లను తుడుచుకున్నాడు; తృప్తితో ఒక మంచిపనిని చేయాలని ముందుకు వెడుతూ.